దళితులపై దాడి సిగ్గుచేటు

శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఎ.షరీఫ్

యలమంచిలి: దళితులపై పోలీసుల చేత దాడి చేయించి వారి భూముల నుండి అక్రమంగా మట్టిని దోచుకుంటున్న వైసిపి నాయకుల తీరు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు అని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ.షరీఫ్ అన్నారు. మట్టి అక్రమ తవ్వకాలకు నిరసనగా చించినాడలో జరుగుతున్న నిరసన దీక్షలు సోమవారానికి ఆరో రోజుకు చేరాయి. ఈ దీక్షను సందర్శించిన షరీఫ్ మాట్లాడుతూ పోరాటాలకు కమ్యూనిస్టు ఉద్యమానికి పురిటిగడ్డగా రాష్ట్రంలోనే ఒక ప్రాముఖ్యత ఉన్న ప్రాంతంగా ఉన్న చించినాడ అంటే తెలియని వారు ఎవరూ లేరని అనేక దశాబ్దాల కిందటే మాజీ ఎంఎల్ఎ ఆర్.సూర్యనారాయణరాజు నాయకత్వాన కమ్యూనిస్టులు భూస్వామ్య వ్యవస్థను ఎదిరించి నిలిచారని, అలాంటి చించినాడలో బరితెగించిన వైసిపి నాయకులు ధనార్జనే లక్ష్యంగా దళితుల జీవనోపాధికి ఉపయోగపడే భూములను కొట్టేసి అక్రమ మార్గం ద్వారా మట్టిని పక్కదారిపట్టించి సొమ్ము చేసుకోవాలనే ఆలోచన చేయడం వైసిపి నాయకులు విరమించుకోవాలని కోరారు.

చినుకు జాడేది..!

వరుణుడి రాక కోసం రైతులు ఎదురుచూపు

ఖరీఫ్‌పై తీవ్ర ప్రభావం

ఈసారి స్వల్పకాలిక వరి రకాలు మేలు : వ్యవసాయాధికారుల సూచన

ప్రజాశక్తి - కాళ్ల

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే వరుణిడి జాడ లేకపోవడంతో రైతులు నారుమడులు వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ ఆలస్య అవకాశం ఉంది. ఇటీవల ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోని డెల్టా శివారు కాలువలకు నీరు వచ్చింది. ఈ క్రమంలో వరుణుడి రాక కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. డెల్టాలో తొలకరి వర్షాలు పలుకరించిన తర్వాతే ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఇంకా ఎండలు మండిపోతుండటంతో నారుమడులు వేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఈనెల రెండోవారం వచ్చినా చినుకుజాడ లేకుండాపోయింది. ఆకాశంలో దట్టంగా మేఘాలు అలుముకుంటున్నా తేలిపోతున్నాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తే గానీ వర్షాలు పూర్తిస్థాయిలో కురిసే అవకాశం కనిపించడం లేదు. రోహిణి కార్తె ముగిసి మృగశిర నడుస్తుంది. దీంతో జిల్లాలో వర్షాలు కురిసే సమయం వచ్చింది. రుతు పవనాలు కేరళ రాష్ట్రాన్ని తాకాయి. మరో నాలుగైదు రోజుల్లో రాష్ట్రాన్ని తాకే అవకాశముందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీంతో జిల్లాలో ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్న రైతులు వరుణుడు రాక కోసం ఎదురుచూస్తున్నారు. చినుకు పడితే విత్తనాలు చల్లేందుకు వీలుగా నారుమడులు సిద్ధం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం సుమారు 5.50 లక్షల ఎకరాల్లో సార్వా సాగు చేపట్టనున్నారు. మెట్ట, డెల్టా ప్రాంతాల్లో రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు ముఖం చాటేయడంతో మెట్ట, డెల్టా రైతాంగానికి ఎదురుచూపులు తప్పని పరిస్థితి నెలకొంది. ఈనెల మొదటివారంలో కురిసే వర్షాల ఆధారంగా సాగు చేపడతారు. కానీ ఎండల తీవ్రత ఇంకా కొనసాగుతుండటం, వర్షాలు కురవకపోవడంతో సార్వాసాగు ఆలస్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. తొలకరి వర్షాలు ఆలస్యం కావడంతో సార్వాసాగుకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఏటా ప్రకృతి వైపరీత్యాల బారినపడి రైతులు వరి పంటను నష్టపోతున్నారు. ఈనెల రెండో వారం వచ్చినప్పటికీ వర్షాలు కురవలేదు. 15 తర్వాత నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అంచనా. ఆ తరువాతే సార్వాసాగు పనులు మమ్మురంగా సాగే అవకాశం ఉంది.

త్వరగా నారుమడులు వేసుకోండి

ఈనెల 15లోపు నారుమళ్ల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, స్వల్పకాలిక వరి పంటలను ఎంపిక చేసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖ జెడి జెడ్.వెంకటేశ్వరరావు ఇటీవల ప్రకటించారు. కేవలం కాలువనీటిపై ఆధారపడి నారుమడులు వేస్తే మొలక శాతంలో బాగా తేడాలు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం నిత్యం 40 డిగ్రీల నుంచి 42 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వరి విత్తనాలు వేసిన తర్వాత నారుమడిని ఆరబెడతారు. ఆ సమయంలో అధిక వేడి వల్ల వేసిన విత్తనాల్లో అధిక శాతం మొలకెత్తే అవకాశం ఉండదు. అందుకే తొలకరి తర్వాతే సార్వా సీజన్ ప్రారంభించడానికి డెల్టా రైతులు సాంప్రదాయంగా భావిస్తుంటారు. ఈ క్రమంలో తొలకరి జల్లుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

స్వల్పకాలిక వరి రకాలు మేలు

ఖరీఫ్‌లో కేవలం స్వల్పకాలిక రకాల విత్తనాలను మాత్రమే రైతులు వేస్తే త్వరగా పంట చేతికి వస్తుంది. స్వల్పకాలిక రకాలైన ఎంటియు 1064, 1061 వరి రకాలు (140 రోజులు) ఈ సీజన్‌లో వేసుకునేందుకు ఆర్‌బికెల్లో అందుబాటులో ఉన్నాయి.

ఎండల వల్ల నారుమడులు వేయలేదు

కొల్లి శ్రీనివాస్, కౌలు రైతు, దొడ్డనపూడి

పంట కాలవల్లోకి నీటిని విడుదల చేశారు. వారం రోజుల్లో నీరు పుష్కలంగా అందిస్తామని అధికారులు చెబుతున్నారు. ఎండల వల్ల నారుమడులు సిద్ధం కాలేదు. ఈనెల 15వ తేదీ దాటాల్సిందే. ప్రారంభంలోనే సాగు జాప్యమైతే తుపానులు, భారీ వర్షాలకు వరి పంటకు నష్టం తప్పదు.

అందుబాటులో విత్తనాలు

శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఎడిఎ, ఆకివీడు

ఎంటియు 1318 వరి రకం(155రోజులు) నారుమడులు వేసుకోవాలి. ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. స్వల్పకాలిక వరి రకాలైన(145 రోజులు) ఎంటియు 1061, 1064, 1029 స్వర్ణ వరి రకాలు కావాల్సిన రైతులు డబ్బు చెల్లిస్తే రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తాం. వర్షం పడితే సీజన్ ప్రారంభమవుతుంది.

ప్రయివేటు విద్యాసంస్థల్లో

ఫీజుల దోపిడీని అడ్డుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - తణుకు రూరల్



ఎంఇఒకు వినతిని అందిస్తున్న నాయకులు

కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల విద్యా శాఖాధికారి కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎంఇఒ ఎస్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వాలు చూసి, చూడనట్టు వ్యవహరించడం వల్ల ప్రయివేటు విద్యాసంస్థలు నిబంధనలు, ఫీజులు, సౌకర్యాల విషయంలో ఇష్టం వచ్చినట్టు దోచుకుంటున్నాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆశలను బలహీనతగా చేసుకుని నర్సరీ నుండి పదో తరగతి వరకూ పెద్ద మొత్తంలో ఫీజుల రూపంలో గుంజేస్తున్నాయని తెలిపారు. ఈ కార్పొరేట్, ప్రయివేట్ స్కూళ్లు నిబంధనలు పక్కనపెట్టి, ప్రభుత్వాన్నే శాశించేస్థాయికి వెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యావిధానంలో నిపుణులతో చర్చించి మార్పులు చేయాలన్నారు. నాడు-నేడు వల్ల పాఠశాలల్లో కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, కానీ ఇంకా చాలా సమస్యలున్నాయనే సంగతి ప్రభుత్వం మరువరాదని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం అమ్మ ఒడి కింద డబ్బులు ఇవ్వడమే కాదు, కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ చాలా ముఖ్యమన్న సంగతి గుర్తు పెట్టుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులపై ఇప్పటికే గ్యాస్, పెట్రోల్, డీజిల్, కరెంట్, నిత్యావసర ధరలు, వైద్యం వంటి ధరలతో సతమతమవుతుంటే, ఈ ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, మూర్తి, కె.రాజు పాల్గొన్నారు.

బాలకార్మికుల నిర్మూలనకు కృషి చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

బాల కార్మికుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ పిలుపు మేరకు కార్మిక శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశంచౌక్ సెంటర్లో ఏర్పాటు చేసిన ర్యాలీని భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, సచివాలయ సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడుతూ ఏ రంగాల్లో బాల కార్మికులు పనిచేస్తున్నా గుర్తించి వారి వికాసానికి పాటుపడాలని కోరారు. వారి ఉజ్వల భవిష్యత్తుకు వారిని జనజీవన స్రవంతిలో తీసుకురావడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, హోటల్స్, ఆక్వారంగం తదితర ప్రదేశాల్లో గుర్తించడానికి ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనెల ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకూ బాల కార్మికుల నిర్మూలనకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి వివిధ ప్రదేశాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించామని చెప్పారు. ఇప్పటివరకూ 20 మంది బాల, బాలికలను గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.శివరామకృష్ణ, తహశీల్దార్ రవి కుమార్, ప్యానల్ లాయర్ ఎన్.సుధీర్, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ రంగ సాయి, శ్రీవేద విజ్ఞాన పరిషత్ నాయకులు డివి.బాలసుబ్రహ్మణ్యం, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్మిక శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు విప్లవాత్మక మార్పులు అందిపుచ్చుకోవాలి : కలెక్టర్

భీమవరం :ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో నిలబడాలనేదే ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అనుగుణంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను ప్రతివిద్యార్థి అందిపుచ్చుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం స్థానిక పొట్టి శ్రీరాములు మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రశాంతి, శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో పాఠశాలల పున:ప్రారంభం నాటికి యూనిఫారాలు, పుస్తకాలు అందేవి కావని, నేడు అలాంటి పరిస్థితి లేదని పాఠశాల ప్రారంభం రోజునే యూనిఫారం, షూలు, పుస్తకాలు తదితర విద్యాసామగ్రి అందిస్తున్నారని తెలిపారు. ఇంగ్లీషు పాఠ్యాంశాన్ని పక్క పేజీలో తెలుగులో అనువదించి ఒకే పుస్తకంలో విద్యార్థుల సౌలభ్యం కొరకు రూపొందించారన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం దశలవారీగా కృషి చేస్తూనే ఉందన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటులో భాగంగా ఆడపిల్లల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రన్నింగ్ వాటర్‌తో టాయిలెట్ల నిర్మాణం చేపట్టామన్నారు. బైజూస్ ద్వారా మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు, విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు, నైపుణ్య అభివృద్ధికి తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి పనిలో నేర్పరితనం అలవడినప్పుడే మంచి ప్రయోజకులుగా గుర్తింపు పొందుతారన్నారు. విదేశీ విద్యకు మార్గం సుగుమం చేస్తూ అందుకు అర్హత ఉన్న టోఫెల్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ప్రభుత్వం చర్యలను ప్రారంభించిందన్నారు. రెండు లక్షల 16 వేల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తే, ఒక్క విద్యకు మాత్రమే రూ.60 వేల కోట్ల కేటాయించారని తెలిపారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యతిస్తూ అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యా కానుక కిట్‌ను విద్యార్థులకు అందించారు. జిల్లాలోని 1,388 పాఠశాలల్లో చదువుతున్న 1,13,580 మంది విద్యార్థులు ఈ ప్రయోజనాన్ని పొందారని తెలిపారు.

విద్యార్థుల భవితకు భరోసా

విద్యా కానుక పంపిణీలో డిప్యూటీ సిఎం కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

రాష్ట్రంలో పేద విద్యార్థుల చదువు కోసం జగనన్న భరోసా కల్పిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు.సత్యనారాయణ అన్నారు. సోమవారం నియోజవర్గంలో పెంటపాడు పోస్ట్ బేసిక్ స్కూల్, పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, పెద్దతాడేపల్లి జిల్లా పరిషత్తు హైస్కూల్లో జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు మంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా జగనన్న విద్యా కానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల అనంతరం బడులు తెరిచిన తొలి రోజునే పిల్లలందరికీ జగనన్న విద్యా కానుకలు అందించేలా ముఖ్యమంత్రి ఏర్పాట్లు చేశారన్నారు. 2019 తర్వాత పేద పిల్లల పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలకు జగనన్న విద్యా కానుక ద్వారా అవసరమైన యూనిఫారాలు, షూలు, బ్యాగులు, పాఠ్య, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, టైలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 17805 కోట్ల రూపాయలు వెచ్చించి పాఠశాలలన్నింటినీ నాడు-నేడులో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్, వైసిపి పట్టణ కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు, పెంటపాడు ఎంపిపి దాసరి హైమావతి పాల్గొన్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

17వ తేదీ వరకూ ఒంటి పూట బడులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వేసవి సెలవుల అనంతరం తిరిగి సోమవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థుల సందడి నెలకొంది. ఇన్ని రోజులూ వేసవి సెలవులు గడిపిన విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు పరుగులు తీశారు. మళ్లీ చదువుల తల్లి ఒడిలో చేరారు. మండలంలోని పాఠశాలలన్నీ విద్యార్థులతో కళకళ లాడాయి. అయితే ఎండలు అధికంగా ఉండడం వల్ల ఒక్క పూట మాత్రమే స్కూలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 17 వరకూ ఉండే ఒక్క పూట మాత్రమే స్కూలు నిర్వహిస్తామని విద్యాశాఖ తెలియజేసింది.

ధర్నా చేస్తున్న విఆర్ఎలు

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి - తణుకు రూరల్

విఆర్ఎల గౌరవ వేతనం డిఎ రికవరీతో సంబంధం లేకుండా ఇవ్వాలని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు బుంగా గణేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ట్రెజరీ కార్యాలయం వద్ద విఆర్ఎల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎస్‌టిఒ బి.జ్యోతిరాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్, ప్రతాప్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విఆర్ఎలకు ఇచ్చిన డిఎను రికవరీ పేరుతో వేధించడం అన్యాయమన్నారు. డిఎ రికవరీ ఆపాలని కోరుతూ సంఘం కోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. అధికారులు కోర్టు పేరుతో మే నెల వేతనాలు ఆపడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కామన మునిస్వామి, ఎం.బలరాం, కె.పోసుబాబు, డివిజన్ అధ్యక్షులు బివిఎవి పండు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నియోజవర్గంలో రహదారుల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాదరాజు ప్రసాద్‌రాజు ఆదేశించారు. సోమవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో రహదారులు భవనాల శాఖ అధికారులతో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన అధికారులకు పలు సలహాలు ఇచ్చారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ఎక్కువ నిధులు ఖర్చు పెడుతున్నామని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని తెలిపారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి లక్ష్మణేశ్వరం, పిఎంలంక రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి డిఇ జివిఎస్.కిరణ్‌కుమార్, ఎఇ టి.నిక్కీక్రజ్ పాల్గొన్నారు.

అర్జీదారులకు శాశ్వత పరిష్కారం చూపాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

వినతులు స్వీకరిస్తున్న జెసి రామ్ సుందర్‌రెడ్డి

స్పందనలో వచ్చిన ప్రతి దరఖాస్తునూ పరిశీలించి ఆర్జీ దారులకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలు మూలలా ప్రజల నుండి వచ్చిన 190 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులకు సంతృప్తి కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా చక్కని పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ డి.అఖిల, జిల్లా పంచాయతీ శాఖా అధికారి జివికె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చలో చించినాడకు అనుమతి లేదు : డిఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 13న చించినాడలో లంకభూముల పోరాట కమిటీ తలపెట్టిన చలో చించినాడకు పోలీస్ అనుమతి లేదని నరసాపురం డిఎస్‌పి మనోహర్ చెప్పారు. సోమవారం ఆయన పాలకొల్లు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. చించినాడతోపాటు జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ ఏక్ట్ అమలులో ఉందని చెప్పారు. వారు కూడా ఎటువంటి అనుమతి తీసుకోలేదని చెప్పారు. మేడపాడులో అక్రమ మట్టి రవాణాపై డ్రైవర్, బ్రోకర్‌తో పాటు నలుగురుపై కేసు నమోదు చేశామని, రేపు కోర్టులో ప్రవేశ పెడుతున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణ శాఖ డిఇఇ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్ కుమార్, సర్కిల్ ఎస్ఐలు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఆచంట: క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో మేలు చేస్తాయని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట పంచాయతీ పరిధి వెన్నపువారిపాలెంలో గత 15 రోజుల నుంచి జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎంఎల్ఎ రంగనాథరాజు చేతుల మీదగా ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విజేతలను అభినందించారు. విజేతలకు ఆచంట సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు రూ.20 వేలు ప్రథమ బహుమతిగా అందజేశారు. ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య రూ.10 వేలు ద్వితీయ బహుమతి విజేతలకు అందజేశారు. వైసిపి పట్టణ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ రూ.5 వేలు, మదన గోపాల స్వామి దేవస్థానం ఆలయ ఛైర్మన్ కుక్కల కిరణ్ రూ.3 వేలు చొప్పున బహుమతులు అందజేశారు.

చేపల చెరువులకు..

అనధికార అనుమతులను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

రెండు పంటలు పండే సారవంతమైన భూములను చేపల చెరువుల కోసం అనుమతులు ఇవ్వరాదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ చినమల్లం గ్రామానికి చెందిన నాలుగెకరాల పంట భూమికి అధికారులు అనుమతివ్వటం పట్ల రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ సోమవారం ఖండించారు. ఆయన చెరువు తవ్వుతున్న ప్రాంతాన్ని నడిపూడి, చిన్నమల్లం గ్రామస్తులతో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు సారవంతమైన వరి పొలాల మధ్య చేపల చెరువులకు అనుమతులివ్వడం సరికాదన్నారు. చినమల్లం గ్రామ శివారులో ఇప్పటికే 9 ఎకరాలు పైగా ఉన్న రొయ్యలు చెరువు వల్ల ఇరు గ్రామాలకు చెందిన చెందిన పంట భూములు చౌడు బారిపోయి 50 నుండి 25 బస్తాలకు దిగుబడి పడిపోయిందని రైతు బొక్కా చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు. దీనికి తోడు మరో నాలుగెకరాలు పంట భూమిని చేపల చెరువుగా తవ్వితే నడిపూడి గ్రామానికి చెందిన ప్రజలకు తాగునీరు కరువవుతుందని, వ్యాధులు సోకుతాయని, పశువులకు నీరు ఉండదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చినమల్లం గ్రామంలోని చేపల చెరువుకు అనుమతులు రద్దు చేయకపోతే గ్రామస్తులతో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపి వల్ల దళితులకు ఒరిగిందేమీ లేదు

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్

ప్రజాశక్తి - యలమంచిలి



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్

దళితుల ఓట్లతో అధికారాన్ని చేపట్టిన వైసిపి ప్రభుత్వం వల్ల దళితులకు ఒరిగిందేమీ లేదని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ అన్నారు. సోమవారం మండలంలోని చించినాడ గ్రామంలో దళితుల భూముల్లో మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన దీక్షను ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశించి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తే గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా దళితులపై విపరీతమైన దాడులు పెరిగాయన్నారు. చించినాడ గ్రామంలో అనేక ఏళ్లుగా పేదల ఆధీనంలో ఉన్న పెరుగులంక భూముల్లో వైసిపి నాయకులు అక్రమంగా మట్టిని తరలించి పేదల పొట్టను కొడుతున్నారని, ఇప్పటికైనా వైసిపి నాయకులు తమ పద్ధతిని మార్చుకోక పోతే 2024లో వైసిపి నాయకులు ఇంటి దగ్గర కూర్చునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

ఉద్యోగుల ఆనందమే ప్రభుత్వ ఆశయం

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉద్యోగుల ఆనందమే వైసిపి ప్రభుత్వ ఆశయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగులకు మేలు చేసే విధంగా పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పలువురు కాంట్రాక్టు మెడికల్ ఉద్యోగులతో పాటు మంత్రి కొట్టు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఉద్యోగులు ఎస్.ప్రసాద్‌బాబు, ఎం.సాయిబాబా, ఎస్.పార్థసారథి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

పోడూరు:తలుపులమ్మలోవ అమ్మవారి దర్శనానికి వెళ్తున్న సమయంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులను సోమవారం ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పరామర్శించారు. జిన్నూరుపాలెం గ్రామానికి చెందిన కుక్కల ఉమా సత్యసాయి, మల్లుల అంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మరో నలుగురిని పరామర్శించారు. ఆయన వెంట టిడిపి నాయకులు పాలవలస తులసీరావు, కుక్కల సత్యనారాయణ, చంద్రశేఖర్, కుక్కల మునీశ్వరరావు ఉన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న పురాతన దేవాలయమైన సీతా రామలింగేశ్వరస్వామి దేవస్థానం పున్ర నిర్మాణానికి సోమవారం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, ఆలయ ఛైర్మన్ మందారపు శ్యామ్ సుందర బాబు, భాగ్యలక్ష్మి దంపతులు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సీతా రామలింగేశ్వరస్వామి దేవస్థానం పున్ర నిర్మించుకోవడం ఎంతో గొప్ప విశేషమన్నారు. అనంతరం ఎంఎల్ఎను ఆలయ పాలకవర్గం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ రుద్రరాజు ఫణి రామకిషోర్, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

వెలగలేరు గ్రామానికి చెందిన కొవ్వూరి వేణు మాధవరెడ్డి రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాధవరెడ్డిని అభినందించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, జగనన్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

పెదఅమిరంలో క్రికెట్ పోటీలు

కాళ్ల:వేసవి కాలంలో క్రీడాకారులను ప్రోత్సహించాలని దృఢ సంకల్పంతో క్రికెట్ పోటీలను నిర్వహించామని గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు అన్నారు. పెదఅమిరంలో గ్రామ స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీలు సోమవారం నిర్వహించారు. తూర్పుపేట, క్రిస్టియన్‌పేట క్రికెట్ జట్ల మధ్య ఫైనల్ పోటీ జరిగింది. ఈ పోటీలో క్రిస్టియన్ పేట జట్టు గెలుపొందింది. ప్రథమ స్థానం సాధించిన క్రిస్టియన్ పేట జట్టుకు రూ.10 వేల నగదు, రెండో స్థానం సాధించిన జట్టుకు రూ.5 వేల నగదు, టోర్నమెంట్ కప్‌లను సర్పంచి డొక్కు సోమేశ్వరరావు చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి జవ్వాది కిషోర్, మాజీ ఉపసర్పంచి కోరా రామ్మూర్తి పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

పాలకొల్లు :కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి మంత్రి వర్గ సమావేశం ఆమోదం తెలిపిన సందర్భంగా సిఎం జగన్ చిత్రపటానికి ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. ఎంఎల్‌సి ఆఫీసులో సోమవారం కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు లెక్చరర్స్ సత్యవతి, జి.జాషువా మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా రెగ్యులర్ అవుతామని ఎదురుచూస్తున్న సందర్భంలో సిఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ పాలకొల్లు యూనిట్ కార్యవర్గ సభ్యులు గుడాల హరిబాబు, వేగేశ్న మురళీకృష్ణంరాజు, రమణ, మధులత, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

ఉండి: ఉండి శాఖ గ్రంతాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేశ్వరరావు, విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్లా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు బొండాడ సూర్య బ్రహ్మానందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాలకుడు జెవి.కృష్ణమూర్తి మాట్లాడుతూ గత 36 రోజులుగా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు నిలయాలు అని ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను విధిగా సందర్శించి చక్కటి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

మట్టి లారీలను నియంత్రించండి

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో మత్స్యపురి ఆర్అండ్‌బిరోడ్డు మార్గంలో ఇబ్బందులు కలిగిస్తున్న మట్టి తరలించే లారీలను నియంత్రించాలని ఎపి జనప్రగతి సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ప్రభాకరరావు స్పందనలో ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా రాత్రీ పగలు మట్టి రవాణా చేయడంతో అసౌకర్యానికి గురవుతున్నామన్నారు. అధిక లోడుతో మట్టిని లారీల్లో తరలించడంతో రహదారి ఛిద్రమవుతోందని ఇళ్లు అదురుతున్నాయన్నారు. తక్షణం మట్టి లారీలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

విగ్రహా ప్రతిష్టలో ఎంఎల్ఎ గ్రంధి

వీరవాసరం: వీరవాసరం కట్టవారివీధిలో కనక మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సోమవారం పాల్గొన్నారు. గత కొద్ది రోజులుగా ఇక్కడ అమ్మవారి విగ్రహప్రతిష్ట కార్యక్రమాల క్రతవును గ్రామస్తులు ఆధ్వర్యంలో వేదపండితులు నిర్వహిస్తున్నారు. అమ్మవారి విగ్రహంతోపాటు గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, ఆలయ శిఖర ప్రతిష్టలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు

ఉండి: హత్య కేసు నిందితుడికి భీమవరం కోర్టు జీవిత ఖైదు, రూ.5000 జరిమానా విధించినట్లు ఉండి ఎస్ఐ కె.గంగాధర్ రావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2021లో ఉండి మండలం వాంద్రం గ్రామానికి చెందిన కోణాల మౌనికను భీమవరం మెంటేవారి తోటకు చెందిన తుంపల ఆదినారాయణ వాంద్రంలోని గమిని ఐస్ ఫ్యాక్టరీ వద్ద కత్తితో పొడిచి చంపినట్లు రుజువైంది. ఈ క్రమంలో ముద్దాయి ఆదినారాయణకు భీమవరం కోర్ట్ జీవితఖైదు, 5000 రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి హామీలో అవకతవకలపై ఫిర్యాదు

పాలకోడేరు :మోగల్లు పంచాయతీలో ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి పరిశీలకునిగా పనిచేస్తున్న ఎ.దుర్గాప్రసాద్ అవకతవకలకు పాల్పడుతున్నారంటూ గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఎంపిడిఒ ఎన్.మురళీ గంగాధరరావుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని జాబ్ కార్డు కలిగి పనికి వెళ్లని కొందరు వ్యక్తుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మట్టి ట్రాక్టర్ల జోరు!

లోడుపై కప్పని బరకాలు

రోడ్డు పడుతున్న మట్టి గడ్డలతో స్థానికుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని మట్టి ట్రాక్టర్ల జోరుకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పెనుగొండ, వడలి గ్రామాల్లో వందలాది టాక్టర్లతో మట్టిని తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం మైనింగ్ శాఖ అనుమతులతో చేలోని మట్టిని తీయాల్సి ఉన్నప్పటికీ స్థానిక అధికారులకు ప్రలోభాలకు గురి చేస్తూ వ్యాపారులు మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. కనీసం లోడుపై బరకాలు కప్పకుండా మట్టిని తరలిస్తుండడంతో రహదారులపై మట్టి గడ్డలు జారిపడుతున్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారులపై ప్రయాణించాలంటే భయమేస్తోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుగొండ రహదారి గుండా ట్రాక్టర్‌తో తరలిస్తున్న మట్టి

విద్యతోనే బంగారు భవిష్యత్తు

విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేతలో పివిఎల్

పాలకోడేరు : మాట్లాడుతున్న డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. మోగల్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకను విద్యార్థులకు పివిఎల్ నరసింహరాజు సోమవారం పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి విద్యార్థులందరూ ఉన్నత విద్యనభ్యసించాలని, ఇంగ్లీషు బోధన అందించాలనే ఉద్దేశంతో అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నాడు - నేడు పథకంలో పాఠశాలలను మోడ్రన్ స్కూళ్లుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఒక్క మొగల్లు హైస్కూల్‌కే 56 లక్షలు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామానికి జూనియర్ కళాశాల మంజూరు చేయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేయిస్తానని పివిఎల్ హామీ ఇచ్చారు. తొలుత నాయకులు, ఉపాధ్యాయులు పివిఎల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ చిగురుపాటి జయంతి మాణిక్యాలరావు, జెడ్‌పిటిసి పెద్దిశెట్టి లక్ష్మీతులసీ సుబ్రహ్మణ్యం, ఎంపిటిసిలు పెన్మత్స వెంకటలక్ష్మి, కాటూరి శాంతకుమారి, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు (బాబు), గ్రామ అధ్యక్షుడు పంపన శ్రీను, ఉప సర్పంచి పెన్మత్స సీతారామరాజు, మంతెన బాపిరాజు, పెన్మత్స నాగరామకృష్ణంరాజు, వీరమల్లు అశోక్ పాల్గొన్నారు.

పాలకొల్లు : విద్యార్థులు జగన్ ప్రభుత్వం ఇస్తున్న విద్యా కానుకను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని ఎంఎంకెఎన్‌ఎం హైస్కూల్లో జగనన్న విద్య కానుక కిట్లను సోమవారం విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుణ్ణం నాగబాబు, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు పాల్గొన్నారు. వీవర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు నాణ్యమైన దుస్తులు, పుస్తకాలతో మంచి చదువు, భవిష్యత్తు ఉండాలనే ఉద్దేశంతో జగన్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ప్రాథమిక విద్యకు ఖర్చు చేస్తోందని వైసిపి పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు చెప్పారు. 27వ వార్డులోని జివిఎస్‌వి మున్సిపల్ పాఠశాలలో జగనన్న విద్యా కిట్లు సోమవారం ఆయన పంపిణీ చేశారు.

కాళ్ల:నాలుగేళ్లుగా అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను నిర్విరామంగా అమలు పరిచిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగో విడత జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ఈ జగనన్న విద్యా కానుకలో ప్రతి విద్యార్థికీ యూనిఫామ్, బ్యాగ్, షూ, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, సాక్సులు, బెల్ట్ వంటి వాటిని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. 315 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు, ఎంపిటిసి చిన్నాపరపు రాంబాబు, మంతెన రామకృష్ణంరాజు, వైసిపి గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, బండ్రెడ్డి ఆదియ్య, ప్రధానోపాధ్యాయులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు, ఉపాధ్యాయులు కట్టా వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర : జగనన్న విద్యా కానుకను ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని మార్టేరు సర్పంచి మట్టా కుమారి అన్నారు. సోమవారం బసంతిదేవి బాలికల హైస్కూల్ విద్యార్థులకు విద్యా కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సర్పంచులు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : జగనన్న విద్యా కానుకను ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని తణుకు మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు అయిశెట్టి శేషకుమారి అన్నారు. వేల్పూరు ఎంపీ యుపి స్కూల్ నంబర్ - 2 పాఠశాలలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మలపరాజు అధ్యక్షతన జరిగిన సభలో జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా శేష కుమారి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య కమిటీ ఛైర్మన్ కుప్పాల శివసాయి దుర్గ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆచంట : ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుకను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పెనుమంచిలి సర్పంచి గణేశుల శేషవాణి సుబ్బారావు అన్నారు. మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మచెరువు, తదితర గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచులు విద్యార్థులకు బ్యాగులు పుస్తకాలు, యూనిఫాం, షూ, బెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు మాట్లాడారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యనందించేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : చింతపర్రు ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు విద్యాకానుక అందజేశారు. ఈ సందర్భంగా కనకలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు, ఉప సర్పంచి బింతి రాజు, ప్రధానోపాధ్యాయులు రామారావు, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉండి : పేదరికం చదువుకు అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చదువుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. యండగండిలో జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమాన్ని ఉద్దేశించి పివిఎల్ నరసింహరాజు మాట్లాడారు. విద్యార్థులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల మధ్య తారతమ్యం ఉండకూడదని ఒకే రకమైన యూనిఫామ్‌ను ఉచితంగా విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నాయకులు రణస్థుల మహంకాళి, వేగేశ్న వేణు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రేపటి నవ సమాజానికి బాసటగా నిలుస్తాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. తూర్పుతాళ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నరసాపురం నియోజకవర్గ స్థాయిలో జరిగే జగనన్న విద్యా కానుక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా రంగంలో రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజవర్గంలో సుమారు 15700 మంది విద్యార్థులకు నాలుగు కోట్ల రూపాయలు విలువచేసే విద్యా కానుక కిట్లను అందించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఎంఇఒ పిల్లి పుష్పరాజ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పాఠశాలల విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. విద్యా కానుక కిట్లను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు నాయకులు విద్యార్థులకు అందజేశారు.

వీరవాసరం : మండలంలోని పలు హైస్కూళ్ళు, ప్రాథమిక పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లును సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయ ప్రకాష్‌నాయుడు, స్కూల్ ఛైర్మన్ ముసలయ్య పాల్గొన్నారు.

పోడూరు : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపుదిద్దుకుంటున్నాయని జెడ్‌పి ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు అన్నారు. పోడూరులోని కల్నల్ డిఎస్ రాజు జెడ్‌పి హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెడ్‌పిటిసి పెద్దిరాజు మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సిఎం పనిచేస్తున్నారన్నారు. అనంతరం జెడ్‌పిటిసి పెద్దిరాజు, ఎంపిపి సుమంగళి సాగర్, సర్పంచి శెట్టి బత్తుల సువర్ణ రాజు, ఎంఇఒ జనార్ధన రాజు విద్యార్థులకు జగనన్న కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎంపిపి సబ్బితి సుమంగలి సాగర్ పాల్గొన్నారు.

నరసాపురంలో..

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

ప్రజాశక్తి - పెనుమంట్ర

తప్పిపోయిన ఎనిమిదేళ్ల చిన్నారి పోతాడ ఏసురాణిని సోమవారం ఐసిడిఎస్ సిడిపిఒ రాణి ఎలిజబెత్, సిబ్బంది తల్లిదండ్రులకు అప్పగించారు. ఐసిడిఎస్ సిడిపిఒ రాణి ఎలిజబెత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆచంట సెంటర్ సంత వద్ద నివాసముంటున్న పోతాడ వెంకట నరసయ్య, సుబ్బమ్మ కుమార్తె ఏసురాణి మార్టేరులోని సంపెనిస్ చిల్డ్రన్ హోమ్ హాస్టల్లో మూడో తరగతి చదువుతోంది. అయితే సోమవారం ఉదయం ఏసురాణి హాస్టల్లో స్నానం చేసి బయటకు వచ్చేసింది. దారి తెలియక తిరుగుతున్న సందర్భంలో గుర్తు తెలిసిన వ్యక్తులు పాపను అడ్రస్ అడుగగా ఆచంటని చెప్పడంతో వనంపల్లిలో ఉన్న కోడ్ నెంబర్ వన్ సుజాత అంగన్‌వాడీ సెంటర్లో సురక్షితంగా ఉంచారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకున్నారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.నాగలక్ష్మి, సిడిపిఒ రాణి ఎలిజిబెత్ జరిగిన విషయం నమోదు చేశారు. చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఛాంబర్స్‌లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం కెరీయర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్‌డిఎఫ్‌సి సర్కిల్ హెడ్ జె.కుమార్ పాల్గొని మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో ఒక ఉద్యోగం కోసం వందల మంది పోటీ పడుతున్నారన్నారు. ఉద్యోగాలు సాధించాలంటే ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్ట ప్రణాళిక, అకుంఠిత దీక్ష అవసరం అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విశ్రాంతి సమయంలో కనీస అవసరాలకు సరిపడా సంపాదన సంపాదించుకునేందుకు నేడు అనేక అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక ఉద్యోగ అర్హత నైపుణ్యం, చురుకుదనం వ్యక్తిత్వ వికాసం విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ అసిస్టెంట్ సర్కిల్ హెడ్ ఎం.రాజేష్, లోకల్ నెంబర్ బిఎన్‌విఆర్ భాస్కర్, మెంటార్ శృతి పాల్గొన్నారు.

20న డైమండ్స్ లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ 2023-24 నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 20న స్థానిక బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరుగుతుందని అధ్యక్షులు, లయన్ కోనా హనుమాన్ తెలిపారు. లయన్ ఇయర్ ఆఖరి సమావేశం సోమవారం స్థానిక డైమండ్స్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్టడ్ గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు, నూతన జోన్ ఛైర్ పర్సన్, లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజుకు నూతన అధ్యక్షులు లయన్ కొప్పిశెట్టి రమణయ్య, కార్యదర్శి మద్దూకూరి మెహర్ ప్రసాద్, ట్రెజరర్ మునగాల జితేంద్ర కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ యూత్ ఐకాన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు క్లబ్ పటిష్టతకు అహర్నిశలూ శ్రమించి జిల్లాలో నెంబర్ వన్ క్లబ్ గా తీర్చిదిద్దారన్నారు. పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, కోనా హనుమాన్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ లంకల పల్లి మధుసూదనరావు, కె.సాయి, సత్యనారాయణ రాజు, గాదిరాజు రామరాజు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలని ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. బాల్యంలో అందరూ విద్యపై దృష్టి పెట్టాలని, అది బాలల హక్కు అని అవగాహన కల్పిస్తూ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వేదాల నాగరాజు, ఎజిపి పాముల చిట్టిబాబు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ ఉండి నియోజవర్గ చర్చా వేదిక కార్యక్రమం సోమవారం సాయంత్రం పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ మంతెన రామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడుతూ సందర్భంగా రానున్న ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో మరోసారి తెలుగుదేశం అభ్యర్థిని గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో చుట్టూ నీరున్నా తాగటానికి స్వచ్ఛమైన చుక్కనీరు పరిస్థితి వైసిపి పాలనలో నెలకొందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే శివరామరాజు మాట్లాడుతూ రాజకీయ, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి పరిచింది తెలుగుదేశం పార్టీ ఒకటే అన్నారు. టిడిపి హయాంలో నియోజకవర్గంలో ఆక్వారంగాన్ని అభివృద్ధి పరిచామని గుర్తుచేశారు. గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చేశామన్నారు. టిడిపి నియోజవర్గ పరిశీలకుడు నాగేంద్ర కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి, వాటర్ డిసి మాజీ ఛైర్మన్ తోట ఫణిబాబు, కాళ్ల, ఆకివీడు టిడిపి అధ్యక్షులు జివి నాగేశ్వరరావు, మోటుపల్లి రామ వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నేత వెంకట ముత్యం మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

సిపిఎం సీనియర్ సభ్యులు కడలి వెంకట ముత్యం (90) సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మృతి చెందారు. ఆయనకు నలుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన సుమారు 50 సంవత్సరాలుగా సిపిఎం అభివృద్ధికి పాటుపడ్డారు. పార్టీ సభ్యుడిగా కొనసాగుతూ కూలి సంఘంలో పనిచేసేవారని పలువురు నాయకులు కొనియాడారు ఆయన లేని లోటు పార్టీకి తీర్చలేనిది అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల పోరాటంలో పాల్గొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, నాయకులు కార్యదర్శి పొదిలి కృష్ణమూర్తి, పార్టీ మండల నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వెంకట ముత్యం (ఫైల్‌ఫోటో)

14న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుండి ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని పాలకొల్లు మండల విస్తరణ అధికారి సంఘాని వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఈ సమావేశం మండలప్రజా పరిషత్ కేంద్రంలోని జిఎంసి బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తామని చెప్పారు. సర్పంచ్ లు, ఎమ్ పి టి సి లు, ప్రతి ఒక్క సభ్యులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు చించినాడలో సంఘీభావ సభ

ప్రజాశక్తి - యలమంచిలి

పెరుగులంక భూముల్లో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్షలకు సంఘీభావంగా నేడు చించినాడ గ్రామంలో జరగనున్న దళిత బలహీన వర్గాల సంఘీభావ సభలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని చించినాడ లంకల పోరాట కమిటీ నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, కేత రాము, చెల్లుబోయిన వడ్డీ కాసులు, ముస్కూడి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, టిడిపి, జనసేన, మాల మహానాడు, మాదిగ దండోరా, ఇతర దళిత సంఘాలు నాయకులు రానున్నారని తెలిపారు. ఈ సభలో చించినాడ దళితులకు అండగా మద్దతుగా ప్రజంత పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని వారు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు కడకట్ల, యగర్లపల్లి, వికెర్స్ కాలనీ, ఎన్‌టిఆర్ జంక్షన్ 2లో మలేరియా మాసోత్సవ కార్యక్రమాలను తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాపికి అడ్డు కట్ట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు జయమేరీ, ఆశాలు దుర్గ, గంగాభవాని, వాలంటీర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పితాని చేయూత

ప్రజాశక్తి - ఆచంట

ఇటీవల సంభవించిన భారీ ఈదురు గాలులకు వర్షానికి నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. ఇటీవల నష్టపోయిన 13 కుటుంబాలను కలిసి బాధితులను ఓదార్చి బియ్యం, నిత్యావసర సరుకులు, కొంత నగదును పితాని చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, మండల అధ్యక్షులు కేతా మీరయ్య, పెనుమంచిలి గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చెట్టి శ్రీరామచంద్రమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

BEFORE THE COMMISSIONER FOR EMPLOYEES' COMPENSATION AND ASSISTANT COMMISSIONER OF LABOUR-IV: T.ANJAIAH KARMIKA SAMKSHEMA BHAVANAM R.T.C CROSS ROADS: AT HYDERABAD.
E.C.CASE.NO. 68 OF 2022 (F)

Between:
Darelli Devi Kumari @ Devi & others.
..Applicants.
AND
Beeravolu Shashidhar Reddy & another.
..Opposite parties.

To:
Beeravolu Shashidhar Reddy
S/o Srinivas Reddy @ Srinivas,
R/o D.No.26-7-1, Flat No.2, 3rd Floor,
Mahal Apartment, Rayalam,
Bheemavaram, Baslumidi Bheemavaram
town, West Godavari District,
Andhra Pradesh State

Take notice that the Applicants have filed the above O.P. Under Section 22 of W.C.ACT.1923 for grant of compensation against you and another. The said case is posted to 26-06-2023 for your appearance.
Hence you are hereby directed to appear in person or through Advocate before the court on 26-06-2023 at 3-00 P.M., without fail, failing which the matter will be decided against you as per law.
Hyderabad,
Dt.12-07-2023

// BY ORDER OF THE COURT //
M. SRINIVSAS REDDY,
Advocate,
Nalgonda.

పత్రికా ప్రకటన

ఏలూరు నగరం, ఏలూరు పట్టణం, యన్.ఆర్.పేట, ఉషాబాల చిట్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఫోర్ మెన్ అయిన **పుట్టి కళ్యాణ చక్రవర్తి, తండ్రి: పి.వి. సుబ్బారావు** అను నేను ఈ పత్రికా ప్రకటన ద్వారా యావత్తు ప్రజానికానికి యిందు మూలముగా తెలియచేయునదేమనగా..,

మా కంపెనీ కలెక్షన్ ఏజెంట్ అయిన నక్కిన రామలింగేశ్వరావు గారు అను వారు ది.10-06-2023వ తేదీ మధ్యాహ్నం 02:00 గంటలకు తన మోపెడ్ (టి.వి.యస్. కంపెనీ) నెం. ఎపి 37 బియమ్ 6838 నందు (1) ఉషాబాల చిట్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన టెంపరరీ రసీప్ట్ బుక్ రిసిప్ట్ నెం. 46926 టు 46950 మరియు (2) యుబికె చిట్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన టెంపరరీ రసీప్ట్ బుక్ రిసిప్ట్ నెం.5657 టు 5700ను ఒక లెదర్ బ్యాగులో వుంచుకొని, ఆ లెదర్ బ్యాగును తన వాహనమునకు తగిలించుకొని, చిట్ కలెక్షన్ నిమిత్తం తిరుగుతూ ఖండ్రికగూడెం సెంటర్‌లో వున్న ఇడ్లీస్ ఫుడ్ కార్నర్ వద్ద తన వాహనమును పార్క్ చేసి, సదరు షాపులోనికి వెళ్లి కూల్ డ్రింక్ త్రాగి, తిరిగి తన టి.వి.యస్. మోపెడ్ వద్దకు వచ్చిచూసేసరికి తన మోపెడ్ హుక్కుకు తగిలించివున్న లెదర్ బ్యాగ్ కనిపించలేదనియూ మరియూ చుట్టుప్రక్కల అందరినీ విచారించి, ఎంతగా వెతికిననూ సదరు బ్యాగు కనపడలేదని. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆ బ్యాగును దొంగిలించినారని మా సంస్థకు తెలియచేసియున్నారు.

కావున యిందుమూలముగా తెలియచేయునదేమనగా సదరు నలుపు కలర్ లెదర్ బ్యాగ్ మరియు అందులో వున్న పైన ఉదహరించిన రెండు టెంపరరీ రిసిప్ట్ బుక్కు ఎవరికైనా దొరికిన ఎడల మా సంస్థకు అప్పగించవలసినదిగా కోరడమైనది. పై రిసిప్ట్ బుక్స్ దొరికినవారు గానీ లేదా దొంగిలించిన వారు గానీ వారి స్వప్రయోజనాలకు ఉపయోగించిన ఎడల సదరు వ్యక్తుల చర్యలు మా సంస్థను ఏ విధంగానూ ప్రభావితం చేయజాలవని యిందుమూలముగా తెలియచేయడమైనది.

ఏలూరు,
10-06-2023.

పుట్టి కళ్యాణ చక్రవర్తి
ఫోర్ మెన్ ఉషాబాల చిట్స్ ప్రయివేట్ లిమిటెడ్,
ఏలూరు. సెల్: 94913 50189
ల్యాండ్ లైన్ నెం.08812 232691